సాక్షి సంగారెడ్డి

బుధవారం । 21 । ఆగస్టు । 2024



డివైడర్‌ను ఢీకొట్టిన కారు

సోదరుడికి రాఖీ కట్టేందుకు భర్తతో కలిసి భార్య పుట్టింటి వెళ్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. వివరాలు 8లో ▸



తాళం వేసిన ఇంట్లో చోరీ

తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన హత్నూర మండలం తార్మాన్ పేటలో చోటుచేసుకుంది. వివరాలు 8లో ▸

సంగారెడ్డికి నేడు మంత్రుల రాక

సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో బుధవారం మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండ సురేఖ పర్యటించనున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

న్యూస్‌రీల్

జోగిపేటలో బంద్ సక్సెస్



జోగిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ 'సేవ్ హిందూస్ ఇన్ బంగ్లాదేశ్' పేరుతో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేటలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక క్లాక్‌టవర్ వద్ద నుంచి వీర హనుమాన్, గొని చౌరస్తా, పోచమ్మ దేవాలయం, పబ్బతి హనుమాన్ దేవాలయం, అంబేడ్కర్ చౌరస్తా, తహసీల్దారు కార్యాలయం, బసవేశ్వర విగ్రహం మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర బజరంగ్‌దళ్ నాయకులు సుభాష్ చందర్, ధర్మసాగర్, ప్రభాకర్ గౌడ్, గోపాల్‌రావు, వి.వెంకటేశం, సుకృత్, గాజుల అనీల్, కడాల రాములు, ప్రభాత్‌కుమార్, శివశంకర్, చిరంజీవి, రమేశ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ



మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

రాయికోడ్(అందోల్): అర్హులైన ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ అవుతుందని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ అన్నారు. రాయికోడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని అర్హులైన రైతులు తమకు సమాచారం అందించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాఫీకాని రైతుల వివరాలు సేకరిస్తున్నామన్నారు. సమావేశంలో ఏఓ సారిక, ఏఈఓలు యాదయ్య, మల్లేశం, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఆస్పత్రి పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం తుర్కపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో పరీక్షల నిర్వహణ, రికార్డులు, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయనవెంట ఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సంధ్యారాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాగారెడ్డి ఉన్నారు.

ఏఆర్ పోలీస్ అధికారులకు పదోన్నతులు



ఎస్పీతో పదోన్నతి పొందిన పోలీసులు

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఏఆర్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు పదోన్నతులు కల్పిస్తూ మల్టీ జోన్ 2 ఐజీ వి.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ఎస్పీ కార్యాలయంలో పదోన్నతి పొందిన వారిని ఎస్పీ చెన్నూరి రూపేష్ అభినందించారు. 13 మంది ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా, 31ఏఆర్ కానిస్టేబుళ్లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు.

నారాయణఖేడ్ డిపో.. రికార్డుస్థాయిలో ఆదాయం

నారాయణఖేడ్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఖేడ్ ఆర్టీసీ డిపోనకు సోమవారం రికార్డుస్థాయిలో రూ.18,30,388 ఆదాయం వచ్చిందని డీఎం మల్లేశయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పండగను పురస్కరించుకొని అదనపు చార్జీలు విధించకుండా ప్రత్యేకబస్సులు నడిపామన్నారు. డిపో చరిత్రలోనే ఒక్కరోజే ఇంత మొత్తంలో కలెక్షన్లు రావడం ఇదే ప్రథమమని తెలిపారు.



సంగారెడ్డిలో రాజీవ్ జయంతి వేడుకలలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



ఖేడ్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

రాజీవ్ సేవలు చిరస్మరణీయం

జిల్లావ్యాప్తంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి రాజీవ్ పార్కులోని రాజీవ్ విగ్రహానికి పూల మాలలు వేసి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి నివాళులర్పించారు. టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు. అలాగే ఖేడ్‌లో రాజీవ్ చిత్రపటానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ పాల్గొన్నారు.

– సంగారెడ్డి రూరల్ /నారాయణఖేడ్

రుణమాఫీపై స్పెషల్ డ్రైవ్



పదిరోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ

- ఫిర్యాదుల స్వీకరణకు నోడల్ అధికారుల నియామకం
- వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

సంగారెడ్డి జోన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకానికి శ్రీకారం చుట్టింది. రూ.లక్ష, రూ.లక్ష యాభై వేలు, రూ.2లక్షలు ఈ విధంగా మూడు విడతలలో రైతులకు రుణమాఫీ చేసింది. అయితే, కొందరు రైతులు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారికి శుభవార్త అందించింది. అర్హత ఉన్నా.. రుణమాఫీ కాని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆధార్‌లో తప్పులుంటే.. దానికి బదులుగా ఓటరు లేదా రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. రేషన్ కార్డు లేకపోతే రైతుల కుటుంబాల వివరాలు సేకరించేందుకు అధికారులు సర్వే నిర్వహించనున్నారు. బ్యాంక్ ఖాతాలో వ్యత్యాసాలను సరిచేయడానికి ఆధార్, పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. అసలు, వడ్డీ లెక్కలు సరిపోకపోతే ఇంటింటికీ వెళ్లి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలను విడుదల చేశారు.

10 రోజులపాటు ఫిర్యాదుల స్వీకరణ

రుణమాఫీ కానీ రైతుల కోసం నేటి నుంచి పది రోజులపాటు అధికారులు ఫిర్యాదులు స్వీకరించనున్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు అందుబాటులో ఉండి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఫిర్యాదుల స్వీకరణకు జిల్లాలోని 27 మండలాలలో నోడల్ అధికారులను నియమించింది. వారు లేనిచోట ఏఈఓలను నియమించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న అన్ని బ్యాంకు శాఖలు, పీఏసీఎస్‌లకు నోడల్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. రుణమాఫీ కానీ రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు స్టేట్‌మెంట్, కుటుంబ నిర్ధారణ కొరకు రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను అందించాలి. ఆధార్ కార్డు లేకపోతే గుర్తింపు కార్డు(ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు) తీసుకు వెళ్లి మోడల్ అధికారులను సంప్రదించాలి.



స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బర్దిపూర్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఓ వెంకటేశ్వర్, తదితరులు

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు

బ్యాంకర్ల వల్ల జరిగిన తప్పిదాలు, కుటుంబ నిర్ధారణ కానివి, మిస్సింగ్ డాటా తదితర సమస్యలపై స్పెషల్ డ్రైవ్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి అధికారులు క్రాప్ లోన్ వివర్స్ పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 97873 మంది రైతులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మూడు విడతలలో రుణమాఫీకి సంబంధించి జిల్లాకు రూ.846.31 కోట్లు విడుదలైనట్లు వివరించారు.

ప్రగతి పనుల్లో జాప్యమెందుకు?

జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన జెడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ కాశీనాథ్



రైల్వే స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న కాశీనాథ్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను మంగళవారం జోనల్ రైల్వే వినియోగదారుల సలహా కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యులు కాశీనాథ్ సందర్శించారు. అమృత్ భారత్ పథకం కింద జహీరాబాద్ స్టేషన్‌ను ఎంపిక చేసి అభివృద్ధి పనుల కోసం కేంద్రం రూ.25 కోట్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. వీటితో రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వెయిటింగ్ హాల్, టాయిలెట్స్, ప్లాట్‌ఫాం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ ఎస్కలేటర్, పార్కింగ్ తదతర పనులు తిరిగి చూశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన సాగుతున్న ప్రగతి పనులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు నత్తనడకన సాగడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పనుల్లో జరుగుతున్న జాప్యం గురించి రైల్వేశాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చురుగ్గా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆయన వెంటన స్టేషన్ మాస్టర్ మాధవ కృష్ణ ఉన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెన్షన్: డీఈఓ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం, విద్యార్థులు, ఉపాధ్యాయులతో దురుసుగా ప్రవర్తించినందుకు సిర్గాపూర్ కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ లలితను, అందోల్‌లోని కేజీబీవీలో జూన్ 24వ తేదీ నుంచి అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరవుతున్న పీజీ సీఆర్‌టీ ప్రియాంకను, హత్నూరలోని ఐటీఐ కాలనీలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఉదయం 11.30 గంటల వరకు తెరవకుండా, సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు ఉపాధ్యాయుడు శ్రీరాములును సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తాం

- రైతుల ఇబ్బందులు పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే
- 'బ్యాంకుల్లో బ్రోకర్లు!' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

నారాయణఖేడ్: రైతుల ఇబ్బందులు తీర్చేందుకు బ్యాంకర్లతో ఈనెల 23 లేదా 27వ తేదీన ఖేడ్‌లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో ఇటీవల 'బ్యాంకుల్లో బ్రోకర్లు!' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. బ్యాంకుల్లో జరుగుతున్న ఇబ్బందులు, సాక్షిలో ప్రచురితమైన అంశాల గురించి పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంగళవారం ఎమ్మెల్యే స్పందించారు. లీడ్‌బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడానని, ఆయన ఆధ్వర్యంలో అన్ని ప్రధాన బ్యాంకు శాఖల జిల్లా బ్యాంకు అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రుణమాఫీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. త్వరలో ఏర్పాటు చేయనున్న సమావేశంలో సమస్యలన్నింటినీ చర్చిస్తామన్నారు.

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు

- అర్హులైన వారందరికీ రుణమాఫీ
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రుణమాఫీపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని, అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక కారణాలతో నిలిపోయిన రైతులకు రుణమాఫీ చేయడం జరుగుతోందన్నారు. రూ.2 లక్షలకుపైబడి రుణాలున్నవారు ఆపై మొత్తాన్ని చెల్లిస్తే రూ.2 లక్షలను ఖాతాలో వేసేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసినా రూ.2 లక్షలకు పైనున్న మొత్తాన్ని మినహాయించుకుని రైతుల ఖాతాల్లో జమచేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యేలమంతా కలిసి కోరామని, అందుకు సానుకూలంగా స్పందన వచ్చిందని, త్వరలో నిర్ణయం వెలువడాల్సి ఉందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను బీఆర్ఎస్ పదేళ్లల్లో రూ.7.50 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎనిమిదినెలల్లో బీఆర్ఎస్ చేసిన అప్పులకు రూ.46 వేల కోట్ల వడ్డీని చెల్లించి 70 శాతం హామీలను అమలుచేయడం జరిగిందన్నారు. అతిమ్యాల్‌కు చెందిన అరుణకు, మార్డికి చెందిన అజయ్‌కుమార్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థికసహాయానికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, నాయకులు శంకర్ ముదిరాజ్, నర్సింహ్మారెడ్డి, సద్దాం పాల్గొన్నారు.

ధరణి కొత్త బిల్లుపై అభిప్రాయ సేకరణ

అందుబాటులో సీసీఎల్‌ఏ వెబ్‌సైట్ : కలెక్టర్ క్రాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సంగారెడ్డి జోన్: రాష్ట్రంలో ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి నూతన ఆర్‌ఓఆర్ బిల్లు – 2024పై సర్కారు ప్రజాభిప్రాయ సేకరణ చేయనుందని, ఈ ముసాయిదా బిల్లును ప్రజలు, రైతులు, వివిధ వర్గాల సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్‌సైట్ www.ccla.telangana.gov.inలో అందుబాటులో ఉంచుతున్నట్లు కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. మంగళవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసరఫరాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో రెవెన్యూ చట్టం పట్ల అవగాహన కలిగి ఉన్న మేధావులతో వర్క్‌షాప్ నిర్వహించి, వారి నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి సీసీఎల్‌ఏకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి, ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పది రోజుల్లో పరిష్కారం కావాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఆర్‌ఓ పద్మజా రాణి, జెడ్పీ సీఈఓ జానకిరామ్, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

సంగారెడ్డి టౌన్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. మంగళవారం మండల పరిధి పసల్‌వాది గ్రామంలో పెండింగ్ దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తులను ఆమోదించాలని సూచించారు. తహసీల్దార్ దేవదాసు, సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇచ్చేది లేదు

అదనపు కలెక్టర్‌కు తేల్చి చెప్పిన గిర్మాపూర్ రైతులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌ఓ వసంత్‌కుమార్ సందర్శించారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు సేకరించే భూములను వారు పరిశీలించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు ఎట్టి పరిస్థితిలో భూములు ఇచ్చేది లేదని, ఏడాదికి రెండు పంటలు పండే వాటిని ఎలా తీసుకుంటారని రైతులు నిలదీశారు. కార్పొరేట్‌లకు లాభం చేకూర్చేందుకు రైతుల పొట్టలు కొడుతారా అని మండిపడ్డారు. చుట్టూ ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పేదల భూముల నుంచే రోడ్డు నిర్మాణం చేయడం సరికాదన్నారు. ఆర్‌ఆర్‌ఆర్‌కు భూములు ఇచ్చేది లేదని గిర్మాపూర్, పెద్దాపూర్ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలైట్‌మెంట్ మార్చాలని అధికారులకు విన్నవించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆటంకం కలిగించవద్దని, మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే మా దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సదాశివపేట, కొండాపూర్ తహసీల్దార్లు సరస్వతి, అనిత, రైతులు జయరాజు, మల్లేశం, జయరాములు, రమేష్, రాములు పాల్గొన్నారు.

ఓబీసీ కులాల జనగణన అవసరం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓబీసీ కులాల ఆధారంగా జనగణన చేయకపోవడం రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘించడమేనని బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో బాంసెఫ్ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. వచ్చే నెల 1న ఇక్కడ బాంసెఫ్ తెలంగాణ రాష్ట్ర 11వ మహాసభలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి డీఆర్ ఓహోల్ హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్పన, ఐఎల్‌పీ రాష్ట్ర నాయకులు నారాయణ, భారతీయ యువ మోర్చా రాష్ట్ర కన్వీనర్ అశోక్, వినయ్ కిషోర్, జనార్దన్, పవన్, బస్వరాజు, శ్రీకాంత్, భానుకిషోర్ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ

సంగారెడ్డి జోన్: అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న చిన్నారులకు ఆకలి పరీక్షలు నిర్వహించాలని మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలిత కుమారి సూచించారు. మంగళవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల పోషక స్థితిని బట్టి వారి ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునంద పాల్గొన్నారు.

'నిమ్జ్' జహీరాబాద్‌కు మణిహారం

- భూములు కోల్పోయిన వారికి ఉపాధి
- గిరిధర్‌రెడ్డి సన్మాన సభలో మంత్రి దామోదర రాజనర్సింహ



సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి దామోదర

జహీరాబాద్: జహీరాబాద్ ప్రాంతానికి జాతీయ పెట్టుబడుల ఉత్పాదక సంస్థ(నిమ్జ్) మణిహారంలాంటిదన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12వేల ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న నిమ్జ్‌లో 2లక్షల 50వేల కోట్ల వ్యాపారాలు, పెట్టుబడులు జరగనున్నాయన్నారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. ఇందు కోసం జహీరాబాద్‌తో పాటు పక్క నియోజకవర్గాల్లో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపడతామన్నారు. త్వరలోనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయ్యేలా చూస్తానన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలను మరింత విస్తరించేందుకు వీలుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రూ.200 కోట్లతో 500 పడకల ఆస్పత్రిని నిర్మించబోతున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాకు క్యాన్సర్ మొబాయిల్ వాహనం స్క్రీనింగ్ నిమిత్తం ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. 'సింగూరు కాల్వలకు సీసీ పనులు చేపట్టేందుకు గాను రూ.200 కోట్లను ఖర్చుచేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీ సురేష్‌షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టీఎస్ ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్, మంకాల్ సుభాష్, కండెం నర్సింహులు, హన్మంత్‌రావు పాటిల్, నర్సింహారెడ్డి, రామలింగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎం.జి.రాములు, ఖాజామియా, మక్సూద్, భాస్కర్‌రెడ్డి, భీమయ్య, నరేష్‌గౌడ్, జమీల్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ పడకల ప్రారంభం

జహీరాబాద్ ఏరియా ప్రభుత్వాస్పత్రిలో ఉన్న కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో మరో ఐదు పడకల యూనిట్‌ను మంత్రి దామోదర ప్రారంభించారు. రూ.10లక్షల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి, డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీధర్, వైద్యులు కిరణ్మయి, ప్రతిభాపాటిల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


స్వామి (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన రాయపోలు మండలం వీరానగర్‌లో చోటుచేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. వీరానగర్‌కు చెందిన నిమ్మరాజు స్వామి (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో భోజనం చేసిన తర్వాత చేపలు పట్టుకుస్తానని ఇంట్లో చెప్పి స్థానికంగా ఉన్న తుమ్మకుంట చెరువులోకి వెళ్లాడు. అందులోకి వల విసిరి దిగేసరికి కాళ్లకు వల చిక్కుకొని చెరువులో మునిగిపోయాడు. విషయాన్ని గమనించిన స్థానికులు రక్షించడానికి చెరువులోకి దిగేసరికి అప్పటికే పూర్తిగా అతను మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య లావణ్యతో పాటు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాయపడిన యువకుడి ..


ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఇటీవల నారాయణఖేడ్ నుంచి పెద్దశంకరంపేట వైపు బైక్‌పై వస్తున్న యువకులు ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో యువకుడు విలాస్ సంఘటనా స్థలంలోనే చనిపోగా ప్రవీణ్‌కుమార్ తీవ్ర గాయాలు కాగా అతడు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండల పరిధిలోని కొత్తాపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలున్నారు. పీసీసీ సభ్యులు కర్ని శ్రీనివాస్ గాంధీ ఆస్పత్రిలో ప్రవీణ్ మృతదేహానికి నివాళర్పించి, కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ విజయరావు, సోషల్‌మీడియా కో–ఆర్డినేటర్ విజయ్, సంగమేశ్వర్, సతీశ్ తదితరులున్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా ..


భూమమ్మ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతిచెందింది.
అక్కన్నపేట మండలం చౌటపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్–2లో ఆయా చుంచు భూమమ్మ(58) 31 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తుంది. ఉదయం అంగన్‌వాడీకి వచ్చిన ఆమెకు గుండెపోటు రావడంతో కుప్పకూలింది. స్థానికులు గమనించి వెంటనే హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కనకయ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండలంలోని గౌరారం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు.
గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ములుగుకు చెందిన ఎర్రన్న కనకయ్య(38) శనివారం రాత్రి బైక్ మీద భార్య విజయ, కుమారుడు వరుణ్‌తో కలిసి ప్రజ్ఞాపూర్ నుంచి ములుగుకు వస్తున్నాడు. మార్గమధ్యలో గౌరారం హోటల్ వద్ద బండిని పార్క్ చేస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొడుతూ ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కనకయ్యను లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్‌కు రాహుల్‌రాజ్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి ఆదేశం


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్‌జోన్: భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌కు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్, ధరణి, ఆర్‌ఓఆర్ చట్టంపై ఖమ్మం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి.. కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సమాచారం ఉందన్నారు. వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వీటిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్నచోట అవసరమైతే తాత్కాలిక ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దన్నారు.
- ధరణి పోర్టల్‌లో.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్క్రూటినీని పూర్తి చేసి మిగతా వాటిని పరిష్కరించాలన్నారు. తిరస్కరిస్తే కారణాలు తెలియజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్‌ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందన్నారు. జిల్లాల్లో ఆగస్టు 23, 24వ తేదీల్లో వర్క్ షాప్ నిర్వహించి, ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, మెరుగైన సూచనలు ఏవైనా ఉంటే ఫీడ్ బ్యాక్ ను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి పంపాలని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, మున్సిపల్ కమిషనర్, జానకీరామ్‌సాగర్, డీఈఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు వేగవంతం..

అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్ పోటీల్లో పాల్గొనేలా చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిలతో కలిసి ఆయన కలెక్టరేట్‌లో ఇన్‌స్పైర్ మనక్ గోడ పత్రిక ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్ల చొప్పున ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 15వ తేదీ లోపు అప్‌లోడ్ చేయాలన్నారు. పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటేషన్ నిర్వహించి ఉత్తమమైన ఐదు ఆలోచనలను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 చొప్పున నామినేషన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా కృషి చేయాలన్నారు.

టెక్నాలజీ తెచ్చిన వ్యక్తి రాజీవ్‌గాంధీ


రాజీవ్ గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ప్రభాకర్

హుస్నాబాద్: దేశంలోనే సాంకేతిక టెక్నాలజీ విప్లవాన్ని తెచ్చిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మహిళా నేతలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధి కోసం శాస్త్ర, సాంకేతిక విద్య అత్యంత ఆవశ్యకమని విశ్వసించిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సమాచార విప్లవానికి నాంది పలికి కంప్యూటరీకరణ, సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కును కల్పించారని, పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతం చేశారన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన సయ్యద్ సాదిక్ కుటుంబానికి చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెండో రహదారి కోసం బైపాస్ నిర్మిస్తే
రామాయంపేటకు అన్యాయం

- మెదక్ ఎంపీ రఘునందన్


ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ఎంపీ రఘునందన్

రామాయంపేట(మెదక్): రామాయంపేట మీదుగా నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి (765 డీజీ)ని బైపాస్ రోడ్డు నుంచి కాకుండా పట్టణం మీదుగా పాత రహదారిలో నిర్మించేలా ప్రయత్నిస్తున్నామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. అనంతరం ఎంపీగా తొలిసారి రామాయంపేట వచ్చిన ఆయన మంగళవారం ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కృతజ్ఞత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జాతీయ రహదారుల శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణం విషయమై ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 46వ జాతీయ రహదారి పట్టణానికి దూరంగా నిర్మించడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. రెండో రహదారి కోసం బైపాస్ నిర్మిస్తే పట్టణానికి అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. పట్టణం మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తే ఎన్ని వ్యాపార సముదాయాలు, ఇళ్లు కోల్పోతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో సమగ్ర సర్వే రిపోర్టు అందజేస్తే బాధితులతో మాట్లాడుతానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షులు దయానందరెడ్డి, చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు భానుచందర్, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, వెల్మల సిద్దరాంలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి


జిల్లా స్థాయి విజేతలతో ఉపాధ్యాయులు

సిద్దిపేటఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి పోటీల్లోను సత్తా చాటాలని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజాప్రభాకర్‌రెడ్డి, సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు అన్నారు. మంగళవారం పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ, జిల్లా సోషల్ ఫోరం భాగస్వామ్యంతో వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు ఆన్‌లైన్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంతో ప్రతిభ ఉంటే తప్ప మండల స్థాయి ని దాటి జిల్లా స్థాయికి రారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఇప్పుడు సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా సత్తాను చాటి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, రాంగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, నీరజ పాల్గొన్నారు. కాగా ఉపన్యాసంలో ఇందిరానగర్ ఉన్నత పాఠశాల ప్రథమ, ఇర్కోడ్ మోడల్ స్కూల్ ద్వితీయ, గట్ల మల్యాల జెడ్పీహెచ్‌ఎస్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. వ్యాసరచనలో బక్రిచెప్యాల జెడ్పీహెచ్ఎస్ ప్రథమ, గౌరవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ ద్వితీయ, నంగునూరు జెడ్పీహెచ్‌ఎస్ తృతీయస్థానంలో నిలిచాయి.

ప్రమోషన్ ఇవ్వాలి

ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్‌ల ధర్నా


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టిజన్‌లు

మెదక్ కలెక్టరేట్: అర్హులైన వారికి తప్పనిసరిగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్ కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయం ఎదుట టీఎస్‌యూఈఈయూ(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయం ప్రతినిధికి వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం 5 ఏళ్లు పూర్తయిన వారికి గ్రేడ్ ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కానీ ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని వినతులు సమర్పిస్తున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ఫాసి, సురేశ్, మల్లేశ్, నాగరాజు, రాజిరెడ్డి, భూపాల్ పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం రూ. 25 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో తలనీలాల హక్కుకు వేలం పాటలు నిర్వహించగా రూ 61.20 లక్షల ఆదాయం వచ్చింది. మల్లన్న ఆలయంలో ఈ సంవత్సరం తలనీలాల హక్కుకు నాలుగు సార్లు ఆలయంలో వేలం పాటలు నిర్వహించగా సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. చివరగా మంగళవారం దేవాదాయ శాఖ కార్యాలయం హైదరాబాద్ నందు వేలం పాటలు నిర్వహించగా రుద్రా ఎంటర్‌ప్రైజెస్ దక్కించుకుంది. కాంట్రాక్టును అధికారులు కమిషనర్ ఉత్తర్వుల కోసం పంపించారు. ఆయన ఆమోదం తెలిపిన వెంటనే పాటదారునికి టెండర్ ఖరారు చేస్తామన్నారు. గతేడాది (2023–24) తలనీలాలు పోగు చేసుకునే లైసెన్స్ హక్కు ద్వారా ఆలయానికి రూ 86 లక్షల ఆదాయం రాగా ఈసారి గత ఏడాది కంటే రూ 25 లక్షల ఆదాయం తగ్గింది. కూరగాయల సరఫరా కోసం నిర్వహించిన లైసెన్స్ హక్కును అయినాపూర్‌కు చెందిన ఎ.గోపాల్ రూ 524లకు పాట పాడి దక్కించుకున్నారు.

ఫొటోలు సజీవ సాక్ష్యాలు

సంగారెడ్డి జోన్: ఫొటోలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని టీఎస్‌ఐఐసీ రాష్ట్ర చైర్ పర్సన్ నిర్మల, కలెక్టర్ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు ఎత్తిచూపటంలో ఫొటోలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫొటోలు ఎంతగానో దోహదపడతాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, నాయకులు కూన వేణు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

డీఏఓ నర్సింహరావు

వట్‌పల్లి(అందోల్): అర్హత కలిగి ఉండి రుణమాఫీ కానీ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని డీఏఓ నర్సింహరావు సూచించారు. మంగళవారం మండలంలోని డాకూరు రైతు వేదికలో జరిగిన రైతు నేస్తంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. మండలంలో వరి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణ, డాట్ సెంటర్ సైంటిస్ట్ శ్రీకాంత్ రాహుల్, సరిత మేడం ఏఓ శ్రీహరి వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్, రైతులు నరసింహారెడ్డి, అర్జున్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

డీవైడర్‌ను ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
- సురక్షితంగా బయటపడ్డ కుటుంబం
- జోగిపేటలో విషాదం


జోగిపేట బస్టాండ్ ఎదుట పల్టీకొట్టిన కారు


అభిలాష్ (ఫైల్)

జోగిపేట(అందోల్): సోదరుడికి రాఖీ కట్టేందుకు భర్తతో కలిసి భార్య పుట్టింటి వెళ్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇందులో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. కానీ భర్త ఛాతినొప్పితో ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. ఈ విషాదకర సంఘటన జోగిపేటలో జరిగింది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం... జోగిపేటకు చెందిన సార వెంకటేశం రెండేళ్ల క్రితం నాగోల్‌కు చెందిన అభిలాష్‌కు తన కూతురు సింధూను ఇచ్చి వివాహం చేశారు. రాఖీ పండుగ ఉండడంతో రాఖీ కట్టేందుకు కారులో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరారు. చందానగర్, పటాన్‌చెరులలో బంధువులను కలుస్తూ రాత్రి 11.45 ప్రాంతంలో జోగిపేటకు చేరుకున్నారు. బస్టాండ్ దగ్గరకు రాగానే కారు అదుపు తప్పడంతో డివైడర్‌కు ఢీకొట్టి బోల్తా కొట్టింది. కారులో బెలూన్‌లు తెరచుకొని పగిలిపోయినప్పటికీ అభిలాష్(33), భార్య సింధూ, ఏడాదిన్నర బాబు సురక్షితంగా బయటపడ్డారు. అంతలోనే అభిలాష్‌కు ఛాతిలో నొప్పిగా ఉందని అనిపించడంతో దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. వెంటనే పెద్దాస్పత్రికి తరలించాలని డాక్టర్ సూచించడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటు రావడంతో మృతిచెందారు. మృతుడి బంధువైన సార యాదగిరి జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో వ్యక్తి
- ఆర్థిక ఇబ్బందులతో బీజేపీ నేత కూడా


గౌసొద్దీన్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): కుటుంబ కలహాల కారణంగా వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని చిన్న ఘనాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దూదేకుల గౌసొద్దీన్(50)కు భార్య, ఇద్దరు కుమారులు కూతురు ఉన్నారు. ఈనెల 19 సోమవారం భార్యాభర్తలు గొడవ పడగా పెద్ద కొడుకు ఇద్దరిని సముదాయించి బయటకు వెళ్లాడు. తర్వాత గౌసొద్దీన్ సైతం బయటికి పోయాడు. కొద్దిసేపటికే గ్రామ శివారులోని మర్రి చెట్టు కింద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కృష్ణ అనే వ్యక్తి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో మొదట చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి డాక్టర్ రిఫర్ చేశారు. ఇక్కడ చికిత్సపొందుతూ అతను మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


సాయిలు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ఆర్థిక ఇబ్బందులతో బీజేపీ నేత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కల్హేర్ మండలంలో చోటుచేసుకుంది. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం..మండల మాజీ అధ్యక్షుడు, మాసాన్‌పల్లికి చెందిన పడమటి సాయిలు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మహదేవుపల్లి శివారులో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ప్రియాంక, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారం ఆభరణాలు, రూ. 80 వేల నగదు అపహరణ


ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన హత్నూర మండలం తార్కాన్‌పేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి ఆంజనేయులు, లావణ్య దంపతులు. భర్త వెంట రాగా పిల్లలను తీసుకొని భార్య సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి రాఖీ కట్టడానికి పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం తిరిగొస్తే ఇంటి ప్రధాన తలుపుల తాళం పగులగొట్టి ఉండడం చూసి కుటుంబీకులు ఆందోళన గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్ రూమ్ లో ఉన్న అలమారా తెరిచి ఉంది. చీరలు, నగలకు సంబంధించిన డబ్బాలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఒక్కసారిగా ఆందోళన గురైన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 15 తులాల బంగారు నగలతో పాటు రూ. 80 వేల నగదు పోయినట్లు పోలీసులకు తెలిపారు. ఎస్సై సుభాశ్ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలను సేకరిస్తుంది. బాధితుడు వంజరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

కుక్కల దాడిలో జీవాల మృత్యువాత


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో జీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండలంలోని లద్నూరులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల బాలయ్య గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. సోమవారం గొర్రెలను మేత కోసం తీసుకెళ్లి రాత్రికి చేరుకొని దొడ్డిలో పంపి బంధువుల ఇంటిలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. రాత్రి కుక్కలు దొడ్డిలో ఉన్న జీవాల మందపై దాడిలో చేయగా 10 జీవాలు మృతిచెందాయి. మరికొన్ని గాయపడ్డాయి. ఉదయం ఈ విషయాన్ని దొడ్డి పక్కనున్న రైతులు బాలయ్యకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించాడు. ఈ సంఘటనతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. జీవాలతో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సహాయం చేయబోతే.. సావుకొచ్చింది..

- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- గాయపడిన వారిని రక్షిస్తుండగా... ఆటో ఢీకొని వ్యక్తి మృతి


డివైడర్‌ను ఢీకొట్టిన కారు, పక్కన ఆటో


రామాగౌడ్(ఫైల్)

దుబ్బాకరూరల్: కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో గాయపడిన క్షతగాత్రులకు సాయం చేస్తున్నాడు. ఇంతలో అతడిని మృత్యువు రూపంలో ఆటో దూసుకొచ్చి ఢీకొనగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ వరుస సంఘటనలు దుబ్బాక రూరల్ మండలం చిట్టాపూర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకున్నాయి. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాలు... కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన రాజేందర్ తన కుటుంబీకులతో కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తున్నాడు. అక్బర్‌పేట–భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 10 గంటలకు వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. అందులో ఉన్న అమూల్య(18), సిరి చందన(14)కు గాయాలయ్యాయి. తన ఇంటి ముందున్న జాతీయ రహదారిపై రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం వినబడగా.. చిట్టాపూర్ గ్రామ వాసి ఇర్కోటి రామాగౌడ్(64) బయటకు వచ్చి చూస్తే కారు డివైడర్‌ను ఢీకొట్టి ఉంది. హుటాహుటిన ఇక్కడికి చేరుకొని గాయపడ్డ వారిని బయటకు తీస్తున్నాడు. ఇదే క్రమంలో రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా ఆటో వచ్చి రామాగౌడ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న అతడి మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. రామాగౌడ్ మృతిచెందడంతో కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.